ఉష చుక్కల్లో చంద్రునిలా వెలిగిపోతూంది కాలేజీ అమ్మాయిల మధ్య. ఆ హొయలూ, ఆ రాజసం చూస్తూ నిలుచున్న అరుంధతి కళ్లు క్రోధంతో ఎర్రగా అయ్యాయి. బుసలు కొడుతున్న అసూయ ముఖాన్ని అసహ్యంగా మార్చింది.

చేతుల్లో ముగ్గు గిన్నె పట్టుకుని అలాగే నిలుచుండిపోయిన ఆమె దగ్గరకు నానీ వచ్చాడు. "అమ్మా! ఉషొత్త నాకు చాక్లెట్ ఇచ్చి వెళ్లింది కాలేజీకి" అని ముద్దు మాటలతో చెపుతున్న వాణ్ణి అలాగే చంకన వేసుకుని అన్యమనస్కంగా లోపలికి నడిచింది.

పనిలో జొరబడినా ఆమెను ఆలోచనలు వదల్లేదు. అరుంధతికి పందొమ్మిది ఏళ్లుంటాయి. చదువుకునే రోజుల్లో ఆకర్షణీయంగానే ఉండేది. మానసికంగా సంసిద్ధం కాని ఆమెను పెద్ద వాళ్ళు పెళ్లికి ఒప్పించారు. చదువుకోవాలన్న కోరికను పరిస్థితులు అణిచివేశాయి. తన వయసు వారందరూ సీతాకోక చిలుకల్లా రంగు రంగుల పావడాలతో రకరకాలుగా సింగారించుకుని కాలేజీకి వెళుతుంటే తాను మాత్రం అప్పుడే ఇద్దరు బిడ్డల తల్లయి ఉచ్చులతో, రొచ్చులతో కాలం గడుపుతోంది.

ఆలోచనతో ఉన్న ఆమె నానిగాడు, "అమ్మా పాయి" అంటూ చీర లాగడంతో ఈ లోకంలోకి



వచ్చింది.

"వెధవా - నువ్విలా జలగలా పీల్చుకుట్టి నే నిలా శవాకారానికి వచ్చాను" అంటూ వాణ్ణి దూరంగా నెట్టివేసింది.

ఇంతలో బుజ్జి వచ్చాడు. ఒళ్లంతా కాటుక, తిలకం కలిపి రుద్దేసుకున్నాడు. వాణ్ణి నాలుగు బాదాలనిపించినా అత్తగారి భయానికి నిగ్రహించుకుంది. తొందరగా పని తీర్చుకుని విశ్రాంతిగా కూర్చోవాలని ఆశపడింది. వాడి అవతారం చూశాక మనసు ఉసూరుమంది.

అసలే సహనం తక్కువయిన అరుంధతికి వెంట వెంట కలిగిన ఇద్దరు పిల్లలు, అత్తగారి అధికారం, కోపిష్టి భర్తతో జీవితం పట్ల విసుగు ఏర్పడింది. సగటు ఆడదానిలా తన వ్యక్తిత్వం చంపుకుంది. ఉన్నత విద్య నభ్యసించి నలుగురిలో తన కో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని, జీవితాన్ని అందమైన కలలా అనుభవించాలనే తీయని ఊహలు చెల్లా చెదరైపోయాయి.

తన వయసుదే అయిన ఉష స్వేచ్ఛా విహంగంలా వయ్యారంగా పుస్తకాలు పట్టుకుని కాలేజీకి వెళుతుంటే ఉడుకుమోతుతనం వస్తుంది అరుంధతికి. "ఈ మిడిసిపాటు ఎన్నాళ్ళులే? రే పా మూడు ముళ్ళు పడితే దీని పొగ రదే అణుగుతుంది" అనుకుంటుంది.

తనని తాను అద్దంలో చూసుకుంది అరుంధతి.

జారిపోయిన శరీరం, పలుచబడిన తలకట్టు, కళ్ల క్రింద నల్లని చారలతో కాంతి తరిగిన ముఖం.

అద్దంలో తొలి యవ్వనపు సొబగుతో ఉష ప్రతిబింబం వెక్కిరిస్తూ కనిపించింది.

ఉషను ప్రకాశ్ కిచ్చి చేస్తే ఎలా ఉంటుంది? ఎలాగయినా పెద్దమ్మతో మాట్లాడి ఈ సంబంధానికి ఒప్పించాలి అనుకుంది.

★ ★ ★ ★

త్వరలోనే ఉషకు, ప్రకాశ్‌కు పెళ్లి చూపులు ఏర్పాటయ్యాయి. ప్రకాశ్ నల్లని నలుపు! ఉషకు తగిన అందగాడు కాడు. అయితే బెంగుళూరులో మంచి ఉద్యోగం.

కట్న కానుకలు అంతగా ఆశించని ప్రకాశ్ సంబంధం వర్ధనమ్మా వాళ్లకి బాగా నచ్చింది.


పెళ్లి చూపుల్లో సిగ్గుల మొగ్గలా ఉన్న ఉషను "అబ్బాయిని బాగా చూశావా, నచ్చినట్టేనా" అంటూ కుదిపి కుదిపి ప్రశ్నించింది అరుంధతి.

ఆమె ఆశించిన అసంతృప్తి ఏదీ ఉష కళ్లల్లో కనిపించక నిరుత్సాహపడింది కూడా.

ప్రకాశ్ ఉష మెళ్లో మూడు ముళ్లూ వేశాడు. ఫలితంగా ఉష చదువుకు స్వస్తి చెప్పి, భర్త వెంట బెంగుళూరు ప్రయాణమయ్యింది.

కొత్త జంటను బెంగుళూరు వెళ్లే ముందు తమ ఇంటికి భోజనానికి ఆహ్వానించింది అరుంధతి.

అరుంధతి వారిస్తున్నా వినకుండా కూడా తిరుగుతూ కబుర్లు చెబుతూ పనిలో సాయపడింది ఉష.



ఆమె మాటల్లో ప్రకాశ్ ప్రసక్తి రాగానే తొంగిచూసే గౌరవం, కళ్లలో ఆరాధనా చూసి - "కర్రి మొగుడుకే ఇంత మురిపెమా" అనుకుని మూతి మూడు వంకరలు తిప్పింది అరుంధతి.

నానీ, బుజ్జీ బాగా మాలిమి అయ్యారు ఉషకు. అరుంధతి కూడా "ఉషాత్త వచ్చిందేమో కాలేజీ నుండి - వెళ్లి ఆడుకో పొండి" అంటూ కసిరేది పిల్లలను.

వాళ్లను వదలాలంటే కళ్లు నీళ్ల పర్యంతంగా ఉంది ఉషకు.

ఆల్బమ్ వెదికి నానీ, బుజ్జీల ఫోటో, అరుంధతి పెళ్లి ఫోటో ఒకటి, విడిగా అరుంధతి ఒక్కత్తీ చెట్టు కొమ్మను పట్టుకుని నిలుచున్న ఫోటో బాగా నచ్చిందంటూ తీసుకుంది.

ఉత్తరాలు వ్రాస్తానన్న వాగ్దానాన్ని ఉష నిలబెట్టుకున్నా అరుంధతి ఎక్కువ కాలం నిలబెట్టుకోలేకపోయింది.

ఆ తరువాత వర్ధనమ్మగారు వాళ్లు, ఆయన రిటైరయి వాళ్ల స్వగ్రామం వెళ్లిపోవడంతో, ఉష దాదాపు అరుంధతి స్మృతుల్లో మరుగునపడిపోయింది.

ఐదు సంవత్సరాలు ఇట్టే దొర్లిపోయాయి.

ఒక రోజు -

ఎప్పటిలానే కాలేజీ అమ్మాయిలు సందడీ, సంతోషమూ మూటగట్టుకుని కాలేజీకి వెళుతున్నారు గలా గలా కబుర్లతో.

ఆనందమంతా తమ సొత్తే అన్నట్టున్న వారిని చూస్తే - ఎవరికైనా "ఒక్క క్షణం ఆ జీవితంలోకి వెళ్లిపోతే!" అనిపించడం కద్దు.

కానీ అరుంధతి దృష్టిని వారెవరూ ఆకట్టుకోవడం లేదిపుడు. ఆమె కళ్లు అవిరామ వర్షానంతరం స్తబ్ధమైన ఆకాశంలా ఉన్నాయి.

మండుటెండలో చివరి బొట్టుతో సహా ఆవిరి అయిపోయిన శూన్య తటాకాలను తలపుకు తెస్తున్నాయి.

ఇంతలో గేటు దగ్గర రిక్షా ఆగింది. ముగ్గురు పిల్లలతో ఉష దిగింది.

చాలా కాలమే అయినా బాగా పరిచయమున్న వ్యక్తి కావడం వల్ల ఉషను వెంటనే పోల్చుకుంది అరుంధతి.

ఆప్యాయంగా నవ్విన ఉషకు, ప్రతిగా సమాధాన మివ్వడానికి ఆమె గుండెను చీల్చుకురావాలని చూసే దుఃఖ కెరటాలు అడ్డం పడ్డాయి.

"అక్కా! కులాసానా?" ఎప్పటిలాగే అరమరికలు లేకుండా ప్రశ్నించింది ఉష.

మౌనంగా తలాడించింది అరుంధతి. ఉష వేసే ప్రశ్నలన్నింటికీ క్లుప్తమయిన సమాధానాలే వస్తున్నాయి అరుంధతి నుండి.

ఆమె ఉషనే గమనిస్తోంది.

ముగ్గురు పిల్లలతో సతమతమవుతూంది ఉష. పైకి విసుక్కుంటున్నా పిల్లల పట్ల గల మురిపెం ముఖంలో తొంగిచూస్తూంది.

వాళ్ళ అల్లరి, వాళ్ల కబుర్లు అదే ప్రపంచమన్నట్లు అందులోనే లీనమయి పోయినట్లు ఉంది ఉష.

అందినదే ఆనందంగా అందుకోగలగడం ఎంత అదృష్టం!...

ఆమె ఇదివరకటి కన్నా లావెక్కి, వయసుకు మించిన దానిలా కనిపిస్తూంది. సహజంగా శరీరంలో జరిగే మార్పులు ఆమె ముగ్గురు పిల్లల తల్లని రుజువు చేస్తున్నాయి.

అయినా అరుంధతి పరిశీలనలో ఇవేవీ లేవు. మాతృ గర్వంతో తళుక్కుమంటున్న ఉష చిద్రూపానికే ఆమె కళ్లు అంకితమయ్యాయి.

"అక్కా! నానీ, బుజ్జీ స్కూల్ నుండి రావడానికి ఇంకా ఎంత సమయం పడుతుంది? ఒకవేళ వాళ్లొచ్చేసరికి నే వెళ్లిపోతే - ఈ ప్రజెంటేషన్ ఉషాత్త తెచ్చిందని చెప్పు. ఇంత ఆలస్యమయింది. ట్యూషన్ గట్రా పెట్టించావా? బాగా పొడుగు ఎదిగి ఉంటారులే వెధవలు, చూచి ఎన్నాళ్లయిందో! బెంగుళూరు వెళ్లాక నానీ ఊరికే కల్లోకి వచ్చేవాడంటే నమ్ము!"

నీటి కుండ బద్దలయినట్టు, నిగ్రహం సడలి ఒక్కసారి బావురుమంది అరుంధతి.

"అక్కా! ఏమయింది - చెప్పవూ?" గాభరాగా అంది ఉష.

"నానీ, నిన్ను చిన్నప్పుడు ఎత్తుకున్న ఉషాత్త వచ్చింది. రారా."

"అక్కా! చెప్పక్కా! ఏమయింది చెప్పక్కా?" వెక్కి వెక్కి ఏడుస్తున్న అరుంధతిని అక్కున చేర్చుకుని ప్రశ్నించింది ఉష.

"నానీ, బుజ్జీ - వేసవి సెలవుల్లో వాళ్ల మేనత్త గారింటికి వెళుతూ - బస్ ఏక్సిడెంట్‌లో ఈ అమ్మని ఒంటరిదాన్ని చేశారు. ఉషా! నాకు ఇప్పుడు పెద్ద చదువులు చదవలేదన్న దిగులు లేదు. అసలు నా పిల్లలు నాకుంటే ప్రపంచంలో నా కంటె అధికురాలు లేదనుకుంటాను ఉషా."

ఉష కళ్లు జలపాత లయ్యాయి.

జీవితంలో అన్నీ ఉన్నప్పుడు కేవలం చదువుకోలేదన్న అసంతృప్తితో ఆనందాన్ని దూరం చేసుకుంది. రాజీపడే స్థితికి వచ్చేసరికి పిల్లలే దూరమయ్యారు. అరుంధతికి ఆనందం ఎప్పుడూ ఆమడ దూరంలోనే ఉంది.

మాటల్లో ఆమెను ఊరడించడం సాధ్యం కాదనుకుందేమో - తన చేతుల్లో ఉన్న చిన్న పాపాయిని అరుంధతి ఒళ్ళోపడుకోబెట్టింది ఉష.

సజల నేత్రాలతో కృతజ్ఞతగా చూస్తున్న అరుంధతి దగ్గర సెలవు తీసుకుని సాగిపోయింది ఉష.